సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

సైదాబాద్, ఆగస్టు 13: సీఎం సహాయనిధి చెక్కులను పాతబస్తీలోని ఫంజేషాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు మంగళవారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి చెక్కులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 28 మంది లబ్ధిదారులకు రూ.12.85లక్షల విలువగల చెక్కులు లబ్ధిదారులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో మజ్లీస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన మేయర్

బడంగ్‌పేట, ఆగస్టు 13: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9,14వ డివిజన్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కార్పొరేటర్లతో కలిసి మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శంకుస్థాపనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతాప్రమాణాలు పాటించాలని.. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జనిగ భారతమ్మ, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, డీఈ జ్యోతి, కార్పొరేటర్లు ఇంద్రసేన, తోట శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనివ్వాలి

మన్సూరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బెల్టులు, బ్యాడ్జీలను అందజేస్తున్న జగదీశ్‌యాదవ్

మన్సూరాబాద్, ఆగస్టు 13: ప్రభుత్వ పాఠశాలలకు చేయూత నిచ్చేందుకు దాతలు ముందుకు రావాలని బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు పోచబోయిన జగదీశ్‌యాదవ్ కోరారు. మన్సూరాబాద్ చౌరస్తాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సొంత ఖర్చులతో బెల్టులు, బ్యాడ్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, నరేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లోని హిందువులను కాపాడాలి

- యాంటీ టెర్రరిస్టు ఫోరం చైర్మన్ రావినూతల శశిధర్
- చైతన్యపురి నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు ర్యాలీ

బంగ్లాదేశ్‌లోని హిందువులను కాపాడాలంటూ యాంటీ టెర్రరిస్టు ఫోరం ఆధ్వర్యంలో చైతన్యపురి నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న రావినూతల శశిదర్ తదితరులు

ఎల్బీనగర్, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లోని హిందువులను కాపాడాలని యాంటీ టెర్రరిస్టు ఫోరం చైర్మన్ రావినూతల శశిధర్ డిమాండ్ చేశారు. మంగళవారం యాంటీ టెర్రరిస్టు ఫోరం ఆధ్వర్యంలో చైతన్యపురి నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు బంగ్లాదేశ్‌లోని హిందువులను కాపాడాలంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రావినూతల శశిధర్ మాట్లాడుతూ.. ఇస్లామిక్ జిహాదీలు బంగ్లాదేశ్‌లోని హిందువులపై చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఇస్లామిక్ తీవ్రవాదులు ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న మారణ హోమాన్ని ఖండించారు. బంగ్లాదేశ్‌లో హిందువులను టార్గెట్ చేస్తూ దాడులు చేస్తున్న ఇస్లామిక్ జిహాదీలపై భారత ప్రభుత్వం, మానవహక్కుల సంఘాలు కఠినంగా వ్యవహరించి హిందులకు బాసటగా నిలువాలన్నారు. బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించడంతో పాటు హిందువుల రక్షణ కోసం గళం ఎత్తాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎటీఎఫ్ కన్వీనర్ బ్రహ్మచారి, కార్పొరేటర్ ప్రేం, సభ్యులు నవీన్, పవన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బిగ్ బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండ యాదగిరి – చంపాపేట, ఆగస్టు 13

రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేబిలేదు

వనస్థలిపురం, ఆగస్టు 13: ప్రభుత్వ దవాఖానలో రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సిబ్బందిపై ఫిర్యాదులు రావడంతో మంగళవారం దవాఖానను సందర్శించారు. రక్త నమూనాల సేకరణ వద్ద ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. ప్రతీ చోట సిబ్బంది నిర్లక్ష్యంగా వహిస్తున్నారన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు ఉద్యోగాలున్నాయన్న సంగతి మర్చిపోకూడదని సూచించారు. అన్ని సౌకర్యాలున్నా వాటి సేవలు అందించడంలో సిబ్బంది విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నమూనాల సేకరణ, పరీక్షల వద్ద ఉన్న సిబ్బందిపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆర్ఎంవో కృష్ణకు సమస్యలను వివరించారు. సిబ్బందికి తగిన సూచనలు చేస్తామని ఆర్ఎంవో తెలిపారు.

వనస్థలిపురం ఏరియా దవాఖానలో సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

కందుకూరు యువజన విభాగం నాయకులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బీఆర్ఎస్ పార్టీకి యువకులు పట్టుకొమ్మలు

కందుకూరు, ఆగస్టు 13: బీఆర్ఎస్ పార్టీకి యువకులు పట్టు కొమ్మలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర యువజన విభాగం నాయకుడు కార్తీక్‌రెడ్డితో కలిసి మండల యువజన విభాగం అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, రాజశేఖర్ గుప్తా మంగళవారం కేటీఆర్‌ను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీలో యువకులకు పెద్దపీట వేస్తామని చెప్పారు. పార్టీ పటిష్టత కోసం కష్టపడి పని చేయాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని తెలిపారు. తిరిగి అధికారంలోకి బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ర్యాలీ

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ పాత మలక్‌పేటలో భారీ నిరసన ర్యాలీని నిర్వహిస్తున్న బీజేపీ నాయకురాలు మాధవీలత, కార్యకర్తలు

మలక్‌పేట, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బీజేపీ నాయకురాలు మాధవీలత ఆధ్వర్యంలో పాత మలక్‌పేట డివిజన్‌లో మంగళవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పాత మలక్‌పేటలోని అగ్రికల్చర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ, నల్గొండ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడాలని నినాదాలు చేస్తూ బ్యానర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వపరంగా తీసుకున్న నిర్ణయాలకు హిందువులపై దాడులకు పాల్పడటం దారుణమన్నారు. కొన్ని శక్తులు పనిగట్టుకొని ఉద్దేశపూర్వకంగా హిందువులపై దాడులకు పాల్పడటం, దేవాలయాలను ధ్వంసం చేయటం, మహిళలపై అత్యాచారాలకు పాల్పడటం, వారి ఇండ్లు, దుకాణాలు, ఆస్తులను ధ్వంసం చేయటం, హత్యలకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడిన వారిని ఉపేక్షించవద్దని, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్షా ఫీజును స్వీకరిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు నాలుగో సెమిస్టర్ మెయిన్, రెండో సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షా ఫీజును ఈనెల 16వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పీజీ కోర్సుల పరీక్షల తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షల తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ తదితర కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.os mania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

బీఎస్సీ ఆనర్స్ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ (సీబీసీఎస్) సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.os mania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

మన్సూరాబాద్, ఆగస్టు 13: ప్రభుత్వ భూములను ఆక్రమించే వ్యక్తులు ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సరూర్‌నగర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తెలిపారు. సరూర్‌నగర్ మండల రెవెన్యూ మన్సూరాబాద్ సర్వే నంబర్.4లోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు జేసీబీతో చదును చేయిస్తున్నారని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆర్ఐ యాదగిరి సదరు ప్రాంతానికి చేరుకుని ప్రభుత్వ స్థలంలో ఎలాంటి పనులు చేపట్టరాదని జేసీబీ డ్రైవర్‌ను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్ఐ యాదగిరి మాట్లాడుతూ.. సౌత్‌ఎండ్ పార్కు సంక్షేమ భవనం సమీపంలోని భూమిలో ప్రభుత్వ స్థలంగా సూచించే బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సదరు బోర్డును తొలగించి భూమిని చదును చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలో ఉన్న సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాల వాల్ పోస్టర్ ఎమ్మెల్యే ఆవిష్కరించారు. బోనాల ఉత్సవాలకు హాజర్ కావాలని కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేశారు. – బడంగ్‌పేట, ఆగస్టు 13

మోహన్‌నగర్ చిత్తారమ్మ దేవాలయం వద్ద ఫలహారం బండి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు ధన్‌రాజ్, సత్యనారాయణ, గణేశ్, ధనుంజయ్, జ్ఞానేశ్వర్, సాయి, నితిన్, నిహార్, శశాంక్, శ్రీకర్, చరణ్‌తో పాటు కార్పొరేటర్ పవన్‌కుమార్, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాశ్‌గౌడ్, గజేందర్, కన్నయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. – ఎల్బీనగర్, ఆగస్టు 13

కర్మన్‌ఘాట్ క్రాంతి క్లబ్ ఆవరణలో ఎరుకల విశ్వనాథ్ గౌడ్ కృషితో నూతనంగా నిర్మించిన పోచమ్మ అమ్మవారి ఫలహార బండి, ఘటాల ఊరేగింపు నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు చేగోని మల్లేశ్ గౌడ్, జగదీశ్‌గౌడ్, శివగౌడ్, బీజేపీ నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, లింగాల దశరథ గౌడ్, పలు పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. – చంపాపేట, ఆగస్టు 13

పౌరాణిక పద్యనాటక పోటీలకు ఆహ్వానం

వనస్థలిపురం, ఆగస్టు 13: తెలంగాణ రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో 9వ పౌరాణిక పద్యనాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు పంపన వెంకటేశ్వర్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఫిలిం డెవలప్‌మెంట కార్పొరేషన్ సౌజన్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి 18 వరకు ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో 8 నాటికలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు సంస్థలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు. వనస్థలిపురం ఎన్జీవోస్‌కాలనీలోని చంద్రకళా వేదికపై పోటీల నిర్వహణ జరుగుతుందన్నారు. పోటీల్లో విజేతలకు పారితోషికాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రదర్శనా పారితోషికం రూ.15వేలు, ఉత్తమ ప్రదర్శనకు రూ.10వేలు, ద్వితీయ ప్రదర్శనకు రూ.5వేలు, తృతీయ ప్రదర్శనకు రూ.3వేలు అందజేయడం జరుగుతుందన్నారు. కళాకారులు, కళాభిమానులు, ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం జేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సహాయం అందజేత

మన్సూరాబాద్, ఆగస్టు 13: దిల్‌సుఖ్‌నగర్‌లో సద్గురు మెడికల్, జనరల్ స్టోర్ నిర్వహిస్తున్న ఫార్మసిస్ట్ చెరుకు శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. మృతి చెందిన శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకునేందుకు రంగారెడ్డి జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ముందుకు వచ్చింది. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెండెం కృష్ణకుమార్ పిలుపు మేరకు స్పందించిన అసోసియేషన్ సభ్యులు రూ.25 వేలను సమకూర్చారు. సదరు చెక్కును చెరుకు శ్రీనివాస్ కుటుంబసభ్యులకు మంగళవారం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెండెం కృష్ణకుమార్, కోశాధికారి సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి పున్న శ్రీనివాసులు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఇటీవల అకాల మరణం చెందిన చెరుకు శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన రంగారెడ్డి జిల్లా కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, కస్తూరి శ్రీనివాస్, జేఎంఎస్ మధుసూదన్, నాగరాజు, సైదులు, కనకయ్య, గోపి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో సంఘం జిల్లా ట్రెజరర్‌గా ముత్యాల మహేందర్

హయత్‌నగర్, ఆగస్టు 13: ఖోఖో రంగారెడ్డి జిల్లా సంఘం ఎన్నికల్లో ముత్యాల మహేందర్ ట్రెజరర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకుని శారీర దారుఢ్యానికి తోడ్పడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె.భాస్కర్‌రెడ్డి, కుమార్, రాజేశ్, డి.సతీశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఎగరెద్దాం.. దేశభక్తి చాటుదాం

సైదాబాద్, ఆగస్టు 13: భాగ్యనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఐఎస్ సదన్ చౌరస్తాలో సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాలను ఎగరవేసి దేశభక్తి చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి, ఐఎస్ సదన్ కార్పొరేటర్ జంగం శ్వేత, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, సహదేవ్‌యాదవ్, బి.నర్సింహా, యాకుత్‌పురా, మలక్‌పేట నియోజకవర్గాల మోర్చాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శంకరమంచి రఘు శర్మకి ఆత్మీయ సత్కారం



శంకరమంచి రఘు శర్మను సత్కరిస్తున్న దర్శనం శర్మ, మునిపల్లె శ్రీనివాస్

ఆర్కేపురం, ఆగస్టు 13: అమెరికాలో శ్రీసాయి దత్త పీఠం వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ శంకరమంచి రఘు శర్మకు మంగళవారం మారుమాముల వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో కొత్తపేటలోని అష్టలక్ష్మి దేవాలయంలో ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా దర్శనం శర్మ మాట్లాడుతూ.. శంకరమంచి రఘు శర్మ అమెరికాలో శివ విష్ణు దేవాలయాల సముదాయాన్ని నిర్మించి అమెరికాలో సనాతన ధర్మాన్ని పరివ్యాప్తం చేస్తూ తెలుగు వారికి ఉపాధి, వసతి కల్పిస్తూ, ధార్మిక సేవ చేస్తూ గౌరవ ప్రతిష్టలు పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శృంగేరి ఆస్థాన పౌరాణికుడు డా.బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, మరుమాముల దత్తాతేయ శర్మ, అష్టలక్ష్మి దేవాలయ చైర్మన్ సోమ సురేశ్, సలహాదారులు కాసులు చంద్రశేఖర్, జగన్, ప్రత్యంగిరా దేవాలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్, వేద పండితులు కాసుల చంద్రశేఖర్‌శర్మ, కొడకండ్ల రాధాకృష్ణశర్మ, భీమ్ సేన్‌మూర్తి, వంశీ, భాస్కర మూర్తి, రఘునందన్, సంగన భట్ట నరసయ్య, గంటి నాగేశ్ శర్మ, హైకోర్టు న్యాయవాది నారుమంచి అనంత కృష్ణ తదితరులు ఉన్నారు.

అధికార ప్రతినిధిగా మహేందర్

బడంగ్‌పేట, ఆగస్టు 13: కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధికార ప్రతినిధిగా తిరుగుపుల్ల మహేందర్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మంగళవారం మహేందర్‌కు నియామకపత్రం అందజేశారు.

గుంతలమయంగా మారిన బాలాపూర్ చౌరస్తా నుంచి బడంగ్‌పేటకు వెళ్లే రహదారి

వెన్ను విరుస్తున్నాయ్..

రోడ్డులో గుంతలు.. పట్టించుకోని అధికారులు

బడంగ్‌పేట, ఆగస్టు 13: బాలాపూర్ చౌరస్తా నుంచి బడంగ్‌పేటకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, టాటా కంపెనీలు, ఇంటర్ నేషనల్ స్కూల్స్, ఎయిర్ పోర్టు రోడ్డు కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. బడంగ్‌పేట కమాన్ సమీపంలోని రోడ్డు గుంతలమయంగా మారిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పల్లె అభివృద్ధికి మనవంతుగా కృషిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 13 : పల్లె అభివృద్ధికి మనవంతు కృషిచేయాలని రూరల్ డెవలప్‌మెంట్ కేంద్ర మంత్రి శివరాజసింగ్ చౌహాన్ అన్నారు. మంగళ వారం రంగారెడ్డిజిల్లా రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిసిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీ రాజ్ (ఎన్.ఐ.ఆర్.డి.– పీఆర్) సమావేశపు మందిరంలో 66వ జనరల్ కౌన్సిల్ సమావేశానికి కేంద్రమంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. డైరెక్టర్ జనరల్ డా.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా గ్రామీణ ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం అమలు కావాలని సూచించారు. రూరల్ డెవలప్‌మెంట్ సహాయ మంత్రి కమలేశ్ పవార్,అధికారులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వినికిడి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వినికిడి, మాట సమస్య ఉన్నవారికి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మ్యాగ్నస్ స్పీచ్, హియరింగ్ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ టి.నాగకిరణ్ తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు చైతన్యపురి చౌరస్తా వద్ద ఉన్న సంస్థ సెంటర్‌లో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 7గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. వినికిడి సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రారంభ దశలోనే సమస్యను గుర్తించి పరిష్కరించవచ్చన్నారు. అవసరమైన వారికి మందులు అందజేస్తామన్నారు. హియరింగ్ మిషన్లు, పరికరాలను సబ్సిడీపై అందజేయడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 97032 35513, 99856 31926లో సంప్రదించాలని సూచించారు.

వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార సహ ప్రముఖ్‌గాఅనిల్

మాదన్నపేట, ఆగస్టు 13: విశ్వ హిందూ పరిషత్ ప్రచార ప్రసార విభాగం తెలంగాణ రాష్ట్ర సహ ప్రముఖ్‌గా మాదన్నపేటకు చెందిన రేగు అనిల్ నియమితులయ్యారు. విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు భోజనపల్లి నరసింహ మూర్తి నియామక పత్రం అందజేశారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కోసమే మెట్రో డీలక్స్ బస్సులు

జలగం విజయ్, మేనేజర్ హయత్‌నగర్ డిపో–1

హయత్‌నగర్, ఆగస్టు 13: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యార్థం కోసమే మెట్రో డీలక్స్ బస్సులు ప్రవేశపెట్టామని హయత్‌నగర్ డిపో–1, 2 డిపో మేనేజర్లు విజయ్, శ్రీనివాస్ అన్నారు. రెండు డిపోల పరిధిలో 290యు రూట్‌లో హయత్‌నగర్ నుంచి జూబ్లీ బస్‌స్టాండ్‌కు, జూబ్లీ బస్‌స్టాండ్ నుంచి హయత్‌నగర్ వరకు రాకపోకలు సాగిస్తున్నామని వివరించారు. మొదటి బస్సు 4 గంటలకు, చివరి బస్సు సాయంత్రం 5.55 గంటలకు, చివరి బస్సు రాత్రి 7 గంటలకు ఉంటుందని తెలిపారు. ఆయా రూట్లల్లో మెట్రో బస్సుల్లో సౌకర్యవంతంగా, తక్కువ చార్జీలతో సులభంగా గమ్యస్థానాలకు చేర్చుతాయని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

TELANGANA STATE GOVERNMENT PENSIONERS FAMILY WELFARE ASSOCIATION
Plot No. 36, J.Rama Rao Apartments, HUDA Complex, Saroornagar, Hyd-35.

NOTICE

All the members of the Telangana State Government Pensioners Family Welfare Association are requested to attend the General Body Meeting to be held on 27-08-2024 at 3.00 P.M. in Senior Citizen Seva Samithi, Sai Nagar Colony, Chaitanyapuri, Hyd.

Sd/- M. SIVA REDDY, President, 9440128503.
Sd/- T.SUBHAKER RAO, Gen. Sec., 9391144656.